# ఎద్దు బతుకు

బీరపాదును నోటితో పీక్కుని మేసేసినపుడు చంపేద్దామన్నంత కోపం వచ్చింది ఎద్దుమీద. చేతి మొయ్యాలాగి వెదురుకర్రొకటి విసిరాడు. తగల్లేదు. వెనకకాళ్ళ గిట్టల దగ్గరపడి దూరంగా తుళ్లిపోయింది. ఏమిటో తను రాయివిసిరినా, కర్రవిసిరినా ఎప్పుడూ గురి తప్పిపోవడమే. అసలిలాంటి ఎద్దుల్ని బందెలదొడ్డిలో పెట్టాలి. ఆలనా పాలనా లేకుండా ఊరిమీదికి వదిలేస్తే, పాదులన్నా మేస్తాయి, పొలాలన్నామేస్తాయి.

నారాయణ ఈసారి ఎద్దును గుర్తు పెట్టుకున్నాడు. ఇంతలేసి వొంపులు తిరిగిన కొమ్ములు - చెయ్యెత్తు పెద్ద ఎద్దు. దాన్నెందుకలా ఊరిమీద వొదిలేశారో ? ఏం సంగతో అరతుపట్టదు. ఇంతకు ముందు చాలాసార్లు చూశాడుగాని ఈసారి నిక్షేపంలాంటి బీరపాదు తినేసిన కారణం చేత, గుర్తుపెట్టుకున్నాడు. దానికి పెట్టడానికే పెంచినట్టు పెంచేరు. ఎంతపువ్వు ! ఎంత పిందె ! తన చిన్నప్పుడు అమ్మమ్మ బీరపువ్వుల్తోనూ, గుమ్మడి పువ్వుల్తోనూ అట్లువేసేది. పర్వతం లాంటి ఎద్దు పాదు మొత్తం తినేసింది. ఎవరి పనుల్లో వాళ్లున్నారు. కానలేకపోయేరు. అంతపెద్ద ఆకారం వుందనమాటేగాని ముఖంలో భీకరం లేదు. రెప్పవాల్చి మౌనముద్రలోవున్న రుషిలా వుంది. కన్ను విప్పిచూస్తే చాలు జాలిజాలిగా బాధబాధగా వుంది. ఎన్నెన్ని బతుకు బరువులు మోసి ఇప్పుడిలా ఊరిమీద పడిందో పాపం !

ఇటుకల గుట్టపక్క, ఇసక వొలికిన గడ్డిమీద పడుకుని నెమరువేసుకుంటాన్నది. మెడమీద వల్లిగా కదుంకట్టిన కాయ చూస్తుంటే ఎన్నెన్ని బరువులు మోసి మోసి అలిసి అలిసి విసిగి విసిగి వేసారిపోయి వుంటుందో ననిపిస్తుంది. ఆ ఎద్దుముఖంలో, చూపులో ఎవరో గొప్ప తత్త్వవేత్త దాగివున్నట్టుంటుంది. జీవితసారం అంతా నమలిమింగి, చివరికిలా కూచుని నెమరువేస్తున్నట్టుంటుంది.

రోడ్డవతల ఖాళీస్థలం కామరాజుగారు కనుక్కున్నారు. రాయితోలించారు. అవతప్పంటివాళ్లు డాబామీద మూడు గదుల వాటా కట్టుకుంటున్నారు. వాళ్ల ఇటుకా, ఇసకా, పిక్కరాయీ తోలించుకున్నారు. వాళ్ళింటి పెరట్లో అరటిచెట్లున్నాయి. పెద్దగెలా, పెద్ద పెద్దకాయలూనూ ఒక పిలక తెచ్చివేసింది అన్నపూర్ణ. ఆమె హస్తవాసి మంచిదే. పిలక బతికి మారాకువేసి ఇప్పుడు చెట్టయింది. పువ్వు దించింది. ఎంతెంత పెద్ద ఆకులో ! ఒకొక్క ఆకులోనూ ఎడాపెడా కూచుంటే పదిమంది సుష్టుగా భోంచెయ్యవచ్చును. పెద్ద గెల మూరెడేసి పొడుగు అరటికాయలు, ఒక్కకాయ కూరే చాలు ఇంటిల్లపాదికీ సరిపోతుంది.

సాయంకాలం అయ్యింది. మరికాస్సేపట్లో దీపాలు పెడతారు. మూడుకిలోమీటర్లు పైగా సైకిలు తొక్కుకుంటూ యింటి కొచ్చేడు నారాయణ. ముందుకి అన్నం కారియరూ మంచినీళ్ల సీసా, చిన్న సైజు టర్కీటవల్. సైకిలు వెనక ఫైళ్లు. వళ్లంతా చెమట చెమట. బట్టలుమార్చుకున్నాడు. ఛీ - చమట వాసన - ఎద్దు గుర్తొచ్చింది. ఎక్కడన్నా, ఏదన్నా తినేస్తున్నదేమో. ఎద్దు గుర్తొచ్చేసరికి గబగబా ఒక చేత్తో తువ్వాలు బిగించుకుంటూ, మరో చేత్తో బుర్రగోక్కుంటూ బయటికొచ్చేడు. రాళ్ళగుట్టమీదికి కాళ్లుపెట్టి

ఎక్కి గోడమీంచి అరటిఆకు అందుకోవాలని చూస్తున్నది. లేతాకు - అప్పటికే గాలికి చిరిగి రెపరెపలాడుతున్నది. నారాయణ పరుగుపరుగున వెళ్లి ఒక పెద్దబెడతీసి విసిరాడు. ఈ సారికూడా తగల్లేదు. బెడ్డ రాళ్లగుట్టమీద పడి పగిలిపోయింది. ఎద్దు బెదిరి పరుగుతీస్తూ రాళ్లగుట్టమీద పడిపోబోయి, ముందు కాళ్ల ముడుకుల మీద కాసుకుని - కుంటుకుంటూ వెళిపోయింది. ఎవరు కొట్టారో ఏమో, లేక ఏ రాళ్లగుట్టదగ్గిరయినా పడిపోయిందో - రక్తం గడ్డకట్టి నల్లగా చార పడింది. ఈగలు ముసురుతున్నాయి.

ఎద్దుపుండు కాకికి రుచి - అని సామెతుంది. ఆదమరిచి గాని పడుకుంటే కాకులు పొడవటం ఖాయం. డొక్కలు లోతుకుపోయి వున్నాయి. ఏమీ మెయ్యలేదుగావును. ప్రెషర్ కుక్కర్, గాస్ పొయ్యా, వంటగనక గంజివచ్చే ప్రసక్తేలేదు. కడుగు పూలమొక్కలకి పోసేస్తుంది అన్నపూర్ణ. తన చిన్నపుడు పెరట్లో నూతిదగ్గర గాబు వుండేది. పెద్దకుండవుండేది. వాటిలో అమ్మ గంజీకడుగూ పోసేది. రోజా దీపాలు పెట్టే వేళప్పుడు పాలుపోసే పెంటమ్మ వచ్చి పట్టుకు పోయేది. ఇప్పుడా రోజులు పోయేయి. ఎంగిలి చేత్తో కాకిని కొట్టరు. సింకులో కడుక్కుంటారు చెయ్యి. మెతుకులు అడ్డం పడితే పుల్లతో పొడుస్తారు. అంతే - అంతే బతుకులో మంచి అన్నది. పుల్లల్తో పొడిచినట్టయిపోయింది.

ప్రహరీ గోడమీంచి అల్లంత దూరంలో కుంటుకుంటూ వడుస్తున్న - తెల్లని సుద్దపర్వతంలాంటి ఎద్దు అగుపడుతూనేవుంది. దాని వాలకం చూస్తే ఈసారి ఎందుకో జాలివేసింది. ప్లాస్టిక్ టబ్‌లో తొక్కలు, ఎంగిలికడిగిన మెతుకులూ పారబొయ్యవద్దని అన్నపూర్ణతో చెప్పాలి. అవి ఎద్దుకు పెట్టమనాలి - అనుకున్నాడు నారాయణ.

ఈ సారేకాదు, ఈ ఎద్దేకాదు - ఆవూ ఎద్దూ గేదే దున్నపోతూ మేకా ఊరకుక్క - ఇలాంటి వాటిని చూస్తే తనకెప్పుడూ జాలే. ఆల్సేషియన్, పికినీస్, బొచ్చుకుక్క - ఇలాంటివాని చూస్తే మాత్రం జాలివుండదు సరికదా -వొళ్లు మండిపోతుంది. ఈ ఎద్దును చూస్తే ముసలి ఎద్దులా లేదు. ముదరెద్దులా వుంది. తనలాగే నడివయసుగావును. అయినా బరువులు మోసుకు తిరిగే బతుక్కి వయసెంతయితేనేం! ఎద్దుబతుకు - ఎద్దుబతుకే. ఎద్దులూ గేదెలూ మొదలైనవి నిస్వార్థజీవులు త్యాగజీవులు. ఎవరాసంగతి గుర్తిస్తారు ? దేశాన్ని అమెరికాకి అమ్ముకుతినేవాడికయితే భారతరత్నలూ, పద్మవిభూషణలూను. బతికినంత కాలం వాట్ని పీడించుకుని పీల్చి పిప్పిచెయ్యడం తప్పితే ఇంకేంవుంది ? ఈ దోపిడీ - నాగరికత మొదలైనప్పణ్ణించీ వున్నది. రుషులూ, దివ్యపురుషులూ గోవత్సాన్ని చంపుకుతిన్నవారే ! వత్సతరీ - అంటే మంచియౌవనంలో వున్న కోడెదూడన్నమాట - అదంటే రుషులకి మహాయిష్టంట ! హయ్యంగవీనం - అప్పుడే వెన్నకాచిన నెయ్యి ! దూడ మూతులు కట్టి ఆవుల్నిపట్టుకు పిండిన పాలుకాచితీసిన వెన్న! ఢిల్లీ శర్మగారు గుర్తొచ్చారు. ఒకసారి ఆయనొచ్చేసరికి - పెద్దవాడు - అప్పటికి వాడు ఒకటోక్లాసు చదువుతున్నాడు. అమ్మ - ఆవు - ఇల్లు ఈగ - ఎద్దు - ఏనుగు అంటూ పేజీలు తిరగేసి - చివరకొచ్చి - ఆవు పాలు ఇచ్చును అని చదివేడు. పెద్దవాడు ఒకటోక్లాసులోనే రెండోక్లాసు పుస్తకం అనర్గళంగా చదివేసేవాడు. ఆ గా గన్నారు శర్మగారు. దూడమూలికట్టి - ఆవును పట్టుకుని - మనం పిండుతాం, అంతే ఆవే మనకు ఎక్కడయినా పాలిస్తుందా ? అనడిగేవు. నిజమే ఆవు పాలు పిండుకుంటాం. ఎద్దులచేత ఎద్దుచాకిరీ చేయించుకుంటాం.

నారాయణ ఇంట్లోకొచ్చి లుంగీపంచి కట్టుకున్నాడు.

ఎద్దు ముదిరితే ఆంబోతవుదా ? తనకి తెలీదు ! ఎద్దు ముదరడం ఏమిటి ? అటువంటి ఎద్దుని అచ్చువేసి వదిలేస్తారట. దానిచేత ఎవరూ పనిచేయించుకోకూడదట. దేవుడి ఎద్దట. దాన్ని 'తోడపెద్దు' అంటారు గావును. పూర్వం ఎద్దుల్ని గంగిరెద్దుల్లా అలంకరించి ఇల్లుల్లూ తిప్పుతూ "డూడూ డూడూ బసవన్నా" అని బూర ఊదుకుంటూ బతికేవాళ్ళు. ఇది గంగిరెద్దులాగ లేదు. దుక్కిటెద్దో, బండెద్దో అయివుంటుంది. మునిసిపాలిటీవాళ్ళకి రిపోర్టుచేస్తే తీసుకుపోయి చెత్తబండికి కట్టేస్తారు. ఎవరు రిపోర్టిస్తారు?. లేదు - ఈ ఊళ్లో చెత్తబళ్లు ఉన్నట్టులేదు. ట్రాక్టర్లే చూశాడు. పోనీ ఒకవేళ చెత్తబండికి కడితే ..... రెండుపూట్లా ఇంతమేత పెడతారు. మేత ముఖ్యము స్వతంత్రం ముఖ్యమా ?

స్వేచ్ఛా స్వతంత్రం ఒకటేనా ?

తాను స్వేచ్ఛ కోసం చిన్నప్పటినుంచీ అలమటించాడు. కోపిష్ఠి తండ్రి. ఏడుగురి సంతానంలో తనుపెద్దవాడు. మూడో పిల్లడి నుంచీ ఎత్తుకుని ఆడించాడు తమ్ముళ్లనీ చెల్లెళ్లనీ. తల్లికెప్పుడూ అనారోగ్యమే. తాను నూతినుంచి నీళ్లు మోసేవాడు. ఒకోసారి వంటసాయంచేసేవాడు. పేదరికం కాదుగాని పేదరికానికి దగ్గరగా వుండే మధ్యతరగతి బతుకు...... స్వేచ్ఛలేని బ్రతుకు. కమ్మని కూరకి కూడా కరువే. కాలే కడుపుకి మండేబూడిద. ఏదో ఇంత తిండీ బట్టా....

వాతావరణం కాస్త చల్లబడింది. చంద్రుడు మబ్బుల్లో చిక్కుకున్నాడు. సూర్య చంద్రుల్ని రాహుకేతువులు మింగేస్తాయి. పాపం వాళ్లకీ కష్టాలు తప్పవనమాట అనుకునేవాడు చిన్నప్పుడు. ఇప్పుడలా అనుకోడు. ఏప్రిల్ చివరివారం. నాలుగు రోజులక్రితం చిన్నగాలిదుమ్మువచ్చి చినుకులు పడ్డాయి. మామిడికాయ రాలిపోతుందట. పోనీ కాగిపోయిన భూమి చల్లబడింది. దాహంతో నోరెండిపోయిన దానిలా భూమి గుటగుటా నీటిని మింగేసింది.

నారాయణ పొద్దున వెళ్లినవాడు సాయంత్రానికి ఇల్లు చేరతాడు. పొద్దున సరిగ్గా తొమ్మిదిన్నరకి బయల్దేరతాడు. ఇంటికీ ఆఫీసుకూ సుమారు మూడుకిలోమీటర్లు. ఉద్యోగంలో చేరిన కొత్తలో తండ్రి వదిలేసిన డొక్కుసైకిలు తొక్కేవాడు. తొక్కుతుంటే ఏపార్టు కాపార్టు ఊడిపోతున్నట్టుండేది. పెళ్లిలో తనకో ఉంగరం, సైకిలూ, ఒకజత క్లాత్‌బట్టలూ దక్కాయి. కట్నం డబ్బులు తండ్రి తీసుకున్నాడు. తీసుకుని, దానికి మరికొంతచేర్చి మరో మగపిల్లడి తండ్రికిచ్చి, అల్లుడ్ని తెచ్చుకున్నాడు. ఆ సైకిలు బాగుండేది ఒకరోజు మూడోకాన్పు సమయంలో భార్యకి మందులకోసం ఒకషాపు దగ్గర సైకిలుపెట్టి - మందులషాపుకి వెళ్లాడు. లారీ వచ్చి సైకిల్ని ముద్దుపెట్టుకుంది. తనకి తగువుకి వెళ్లడం రాదు. బ్రతికినంతకాలం తండ్రికి భయపడుతూ - భయపడుతూ, డబ్బుకోసం భయంచతుంగా బ్రతికినవాడికి ధైర్యం ఎలా వస్తుంది?. తను బొత్తిగా నోరు మూసుకోలేదు. ఏదో అన్నాడు. పరిస్థితి చూసి మందులషాపు యజమాని లారీవాడ్ని గట్టిగా తగులుకున్నాడు. అతనికి తను తెలుసును. తన తండ్రి తెలుసును ఇప్పుడీ మందులు అప్పు ఇస్తున్నాడు. కరక్టుగా ఫస్టుకి తీర్చేస్తాడు. తండ్రి చేసిన అలవాటు. ఆ మంచితనంవల్ల తనని వెనకేసుకొచ్చాడు. కళ్లు కనపడ్డం లేదా అనితిట్టాడు. రాంగ్ సైడొచ్చేశావన్నాడు. లారీవాడు పాపం

ఏమనుకున్నాడో ఏమో రిపేర్లకోసం యాభయిరూపాయలిచ్చాడు. సైకిలు షాపువాడు బాగా తెలిసినవాడే. ఫోర్కుపుల్లలు వేశాడు. మడ్‌గార్డుసాపుచేశాడు. ఇంకేవేవో చేశాడు. తను బేరం ఆడి బేరం ఆడి నలభయిచ్చాడు. ఆ రోజు సాయంత్రం ఇంటికి వెళ్లేసరికి చాలాపొద్దుపోయింది. భార్య నిద్రపోతోంది. తనే ఇంత పెట్టుకుని తిన్నాడు. ఒక వారం తరవాత ఆడపిల్ల పుట్టింది. ప్రమోషన్ వచ్చి యూడీ అయ్యాడు - తరచుగా రిపెయిర్లు వస్తున్నాయని అమ్మేసి - వెయ్యిరూపాయలు ఫెస్టివల్ అడ్వాన్సు పుచ్చుకుని అట్లాసు సైకిలు కొన్నాడు. అప్పుడు రెండో ఆడపిల్ల పుట్టింది. పదేళ్లనుంచీ అట్లాసు బండి తననే తన సంసారాన్నీ మోస్తోంది. నిజానికిది సైకిలుకాదు ఎద్దులబండి. నారాయణ ఎప్పుడన్నా సైకిలుకి ఏసంచిగాని, షైళ్లుగాని ఏ లంపటమూ లేకుండా - అలాగ వెళ్తుంటాడు. అప్పుడతనికి గుర్రం ఎక్కినట్టుంటుంది. కాదు - కాదు - పద్మిని ప్రీమియర్ కారెక్కినట్టుంటుంది - అనాలిగావును. అంతా నారాయణని చిన్న లూనా కొనుక్కోకూడదా అంటుంటారు. కొనుక్కోవచ్చు. కాని ఎందుకో జంకు. పెద్దపిల్ల పెద్దమనిషై మూడేళ్లయింది. సంబంధాలు చూడటం ప్రారంభించండని - ఈ మధ్యహెచ్చరించడం ప్రారంభించింది అన్నపూర్ణ. మొగుడు స్కూటర్ - కనీసం లూనా కొంటే వెనక కూచుని, మంచి చీరకట్టుకుని, ఇన్ని మల్లిపూలు పెట్టుకుని, చిన్న పిసరు సెంటురాసుకుని, సరదాగా సెకండ్ షోకి వెళ్లాలని ఎంతకోరికో! ఇరవై ఏళ్లక్రితం పెళ్లయిన కొత్తలో, పెద్దవాడు కూడా పుట్టకముందు వెళ్లారు. మరిక ఈ జన్మకింతే రాసేడు దేవుడు నాకు - "అని వాపోతుంది. పిల్లల్తో ఇంటెడు చాకిరీ చేసుకునీ సరికి, నడుంపీక్కుపోతుంది.

నారాయణ లూనా కొనలేదు, స్కూటరూ కొనలేదు. పదేళ్లక్రితం పదిసెంట్ల స్థలంకొన్నాడు. ప్రావిడెంట్‌ఫండ్ పార్ట్ ఫైనల్ విత్‌డ్రాయల్ పెట్టికొంత, తన ఉంగరం, భార్య ఉంగరం, పెద్ద కూతురికి బారసాలనాడు అత్తవారు పెట్టిన చిన్నగొలుసు ...... ఇలాంటివి చిన్నాచితకా బంగారం అమ్మి కొంత, ఇద్దరు ముగ్గురు మిత్రులదగ్గిర స్వల్ప వడ్డీకి అప్పుతెచ్చికొంత ...... పడరాని పాట్లుపడి ఇల్లుకట్టాడు. నిజానికి స్థలం ఏడుసెంట్లే. ఆ పక్కనే చిన్నకాలవా, తాటిపెండీవున్నాయి. అదొక మూడుసెంట్ల స్థలం కలిసి వచ్చింది చవగ్గాను. ఊరవతల పోరంబోకు - తాటిపెండె, తుమ్మ చెట్లు, బ్రహ్మచెముడు డొంకలూ వుండేవి. మధ్య మధ్య పెద్దపెద్దరాళ్ళు - నక్కలూ,పాములూ తిరిగేవి. ఇప్పుడది పెద్దకోలనీ, భాస్కరనగర్ కోలనీ - . చిన్నపార్కు, నీళ్లటాంకు, విశ్వభారతి ప్రయివేటు స్కూలు అన్నీ వచ్చాయి. మొదట్లో రాత్రయ్యాక ఇటువేపు రావాలంటే భయంగా వుండ్రది. ఈ ఇల్లు నారాయణ ఎన్ని కష్టాలు పడికట్టుకున్నాడు. తనబోటి సగటు మానవుల జీవితం కష్టాలపుట్ట......

ఇంటి చుట్టూ బోలెడు స్థలం. అన్నపూర్ణ పాదులుపెట్టిది. నారాయణ వేప చెట్టూ, మామిడిచెట్టూ నాలుగు కొబ్బరి చెట్లూ వేశాడు. నాలుగేళ్లయి వుంటుంది. ఒకరోజు సాయంత్రం నాలుగుగంటలవేళ, గాలికి దుమ్మూ ఎండిన ఆకులూ తుక్కూ ఎగిరి నానాచెత్తగానూ వుందని - వాకిలి తుడుస్తున్నది అన్నపూర్ణ, కొబ్బరిబొండాం దభేలుమని నడుంమీద పడింది. అమ్మోఅమ్మో చచ్చేన్నాయనో అంటూ కుప్పకూలి పడిపోయింది. మరి మంచం దిగదుగావునని భయపడ్డాడు. ఎముకలు విరిగిపోయాయనుకున్నాడు.

ఎక్స్‌రే తీయించాడు. ఎముకలు విరగలేదు. మందులు వాడేడు. - ఆ ఖర్చుల్తో నారాయణ నడుం విరిగింది. ఇంటిపనంతా ఇద్దరాడపిల్లలమీదా పడింది. చిన్న పిల్ల ఏడవతరగతి పరీక్ష తప్పింది.

ఇంతయిల్లు కట్టించేడుగాని ప్రహరీగోడ పురాగా కట్టించలేపోతాడు. పెరటివేపు నుయ్యీ లెట్రనూ, బాత్‌రూమూ వున్నాయి. అటువేపు గోడ కట్టించాడు. దొంగభయం ఎక్కువగా వుండేది. కొత్తలో ఒకసారి దొంగలు పడ్డారు. బాత్‌రూమ్‌లో మర్చిపోయిన స్టీలుబిందె, రోజూవుండే పెద్ద ఇనుపబక్కెట్టు, ఒక టర్కీటవలూ పోయేయి. అన్నపూర్ణకు వణుకు పట్టుకుంది. దొంగగాని యింట్లో దూరేడా మొత్తం ఊడ్చిపెట్టుకుని పోను. కొంప కొల్లేరయి పోను. అప్పట్లోనే వెనక వరస ప్రహరీగోడ కట్టించేశారు. ముందు గేటు దగ్గర అటూయిటూ వెడల్పుగా స్తంభాలు కట్టించేడు. ఇనుపకంచె పెట్టించి తుమ్మముళ్లుపెట్టేడు. కంచె దట్టంగానే వుంది. చెట్లు బాగా పెరిగి మధ్యమధ్య పువ్వుల్తో కంచె కళకళలాడుతోంది. పోనిదీ బాగానే వుందని తనలో - తనే చేతకాని నవ్వొకటి నవ్వుకున్నాడు. మొత్తం ప్రహరీగోడ కట్టాలంటే - లేదు లేదంటే పదివేయికావాలి. ఎక్కణ్ణించి తేవడం ! ఇద్దరాడపిల్లలు ఎదుగుతున్నారు....

ఆ రోజు ఆదివారం. అన్నపూర్ణ పారేసిన అరటితొక్కలు తింటుంది ఎద్దు. నింపాదిగా ఎటో చూస్తూ నములుతున్నది. ఒక్కసారే పళ్లన్నీ ముగ్గిపోతున్నాయని తలా రెండేసి మూడేసి పళ్లుతిన్నారు. తొక్కలన్నీ తినేసి, "ఇంతేనా ఇక వెళ్లొచ్చునా" అన్నట్టు చూసింది ఎద్దు. కిటికీలోంచి, కంచెమీంచి ఎద్దు తల కనిపిస్తున్నది. ఎద్దు తనతో ఏదో మాట్లాడు తున్నట్టున్నది. ఏదో చెప్పడానికే తన వేపు చూస్తున్నట్టున్నది. కరెంటుపోయింది. ఎంతపెద్ద, మరెంత బలం వున్నా నోరు లేని జీవం కదూ - అడుక్కోలేదు. తనకష్టం ఇతరులు దోచుకుంటే, తాను కడుపుకోసం గడ్డి తినాలి ! అదీ దొరకదు. పచ్చని జాగా కనపడనివ్వకుండా వున్నారు. ఇళ్లు, కోలనీలు, ఫాక్టరీలు, సినిమా హాళ్లు, దేవుడిగుళ్లు...... ఉపయోగపు...కు అర్థం ఏమిటి ? స్వప్రయోజనం అనేకదూ. ఎద్దులకీ, దున్నపోతులకీ స్వప్రయోజనం వుండకూడదు. మనుషులందరిలో కూడా కాదు - అందులోనూ కొందరికే !

ఒకరోజు నారాయణకు ఆ ఎద్దునుచూస్తే జాలి వేసింది. డొక్కలు లోతుకు పోయివున్నాయి. పుండు మానలేదు. ఎందుకొచ్చిన వెధవ శరీరం అని విసుక్కుంటూ నీరసంగా నింపాదిగా నడుస్తున్నది. పుండు మీద ఈగలు ముసురుతున్నాయి. ముందున్న ఎడమకాలికి కదా తగిలింది దెబ్బ. అక్కడ దాకా తోకరాదు. కనుక ఈగల్ని తోలుకోవడం కూడా కష్టమే. పూర్వం ఎద్దులకీ, ఆవులకీ పెద్దగంగడోలుండేది. వీపు మీద మూపురం వుండేది. ఇప్పటి వాటికి అవేం లేవు. మేలుజాతి సంకర పశువులు. హైబ్రిడేషన్ మంచిదే. ఈ మేధావులు కులాంతరవివాహాల్ని ఎందుకు పాపులరైజ్ చెయ్యరో - ఒకసారి అన్నపూర్ణతో మాటల సందర్భంలో - కులాంతర వివాహాల్లో తప్పేంవుందీ ?. అన్నాడు. "మీ వాలకం చూస్తుంటే మనపిల్లలకు కులాంతరం పెళ్లి చేసేలా వున్నారు. నాకలాంటి పన్లు ససేమిరా నచ్చవు. అలాంటిదేదన్నా జరిగిందో - ఇంట్లోంచి పారిపోతానంతే"నని అల్టిమేటమ్ ఇచ్చింది. ప్రపంచంలోని ఈ వికృతాలూ వైరుధ్యాలు నారాయణకి మింగుడు పడటం లేదు...... అంతపెద్ద ఎద్దును చూస్తుంటే హైబ్రిడ్ ఎద్దులా లేదు. కాని

గంగడోలు బొత్తిగా తక్కువ. మూపరం కూడా లేదు. బాగానే వుంది. ఎద్దయిన తరవాత హైబ్రిడయినా ఒకటే, స్వజాతయినా ఒకటే. కష్టం చేసుకు బతక వలసిందే. కృష్ణాజిల్లాలోనో, గుంటూరు జిల్లాలోనో గుర్తు లేదు ఎడ్ల పందాలవుతాయట. ఈ ఎద్దును చక్కగా మేపి తయారు చేస్తే ఎడ్లపందేలకి తీసుకెళ్లొచ్చు....

ఆ రోజుదేనికోగాని సెలవు. భోజనం చేసి ఆకులు, అరటితొక్కలు పారేశాక ఆ ఎద్దు వస్తుందేమోనని ఎదురు చూశాడు. పాలుపోసే సంజీవరావు గేదెలు వచ్చి తినేసి పోయింది. ఆ ఆకులలా పారెయ్యకుండా వుంచి ఆఎద్దుగాని వస్తే దానికి మేపితే బాగుణ్ణనిపించింది.......

ఈ మధ్య కోలనీలోకి పందులు తెగవచ్చి పడిపోతున్నాయి.

ఎద్దులు - పందులు - గేదెలు - కుక్కలు -పిల్లులు - ఈ మధ్య పిల్లొకటి తెగజొరబడిపోతుంది. రెండుమూడుసార్లు పాలూ పెరుగూ తాగేసి పోయింది. అన్నపూర్ణొకసారి గురిచూసి ఇనపగరిటె విసిరేసింది. గురి తప్పలేదు. గట్టిగా తగిలివుంటుంది. మియ్యాం మియ్యాం అనుకుంటూ ముళ్లకంచె మీంచి గెంతి పారిపోయింది. మరి పత్తా లేదు....

ఆగస్టు నెల రెండోవారం. మరోరెండు మూడురోజుల్లో దేశ స్వాతంత్ర్య స్వర్ణోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఎండలు చెంప పడలగొడుతున్నాయి. ఒకవారం క్రితం గావును - ఒక్క పెద్దవాన పడ్డాది. అంతే. ఇక చూస్కోండి ఎండలు ! మండిపడిపోతున్నాడు సూర్యుడు ! చెమటలు పోసేస్తున్నాయి - దాహం - దాహం - ఎండా కాలంలా వున్నాది.

దీపాలు పెట్టేవేళ ఏవేవో సరుకులూ, కూరగాయలూ కొనుక్కుని గాడిదబదువుతో బండి తోలుకుంటూవచ్చాడు. సైకిలు కాదది, ఒంటెద్దుబండి. ఒగుర్చుకుంటూ దిగి - రోడ్డుమీంచి గుమ్మంలోకి ఎ...గచి లోపలికి తెచ్చాడు. సైకిలొక ఒంటెద్దు బండి. తను బండినవాడు. చి చీ కాదు. అదిబండి. తను ఎద్దు - ఈ కష్టాలు - ఈ బరువులు - ఈ బాధలు - ఇంకాఎన్నాళ్లో ..... మగపిల్లలకుద్యోగాల్లేవు - ఆడపిల్లలకి పెళ్లిళ్లు లేవు - ఇంటికి కాంపౌండు వాలు లేదు - ఎలాగా? యాభైఏళ్లొచ్చేయి - ఒకటి - రెండు - యాభైరెండు కూడా వచ్చేయి - రిటయిరయ్యే సరికయినా సమస్యలు ఒక్కటొక్కటి తెగ్గొట్టుకుంటూ రావాలి. వయసులో వున్నప్పుడు నిరుద్యోగం - పెళ్లి - ఉద్యోగం - ఉమ్మడికుటుంబం - పిల్లలు - ఇప్పుడే అప్పుచేసి పప్పుకూడులా ఇల్లు - ఇదిగిన పిల్లలు - ఎప్పుడూ కష్టాలే - సముద్ర కెరటాలయినా ఆగుతాయిగాని సమస్యలు అగుతాయా - కొన్నికొన్ని తనువులు ఇంతే - తనబతుకూ ఇంతే -

ఆగస్టు 15 వచ్చింది. వెళ్లింది. ప్రభుత్వకార్యాలయాల్లో.... పాఠశాలలో.... మూడు రంగుల జెండా లెగిరేయి. ఆ రాత్రి ఆకాశం ఫెళాఫెలలాడింది. నల్లటి కాటుక లాంటి మబ్బులు ఉరుములూ మెరుపుల్తో కమ్ముకొనొచ్చేయి. హోరుగాలి - గాలిహోరు - క్రమంగా గాలి నిమ్మళించింది. ఆకాశం కుండ పగిలినట్టు, ఏనుగులు తొండాల్తో చిమ్మినట్టు వాన. ఒకటే బాదుడు బాదింది. యథా ప్రకారం కరంటుపోయింది. వాతావరణం చల్లబడ్డందుకు నారాయణ చాలా సంతోషించాడు. చిన్నప్పటి పాటలు గుర్తొచ్చాయి.

"వానల్లు కురవాలి వానదేవుడా
వరిచేలు పండాలి వానదేవుడా
గాదుల్లు నిండాలి వానదేవుడా "

ఇప్పుడా పాటలేవీ ? వెధవ స్టీరియో ఫోనిక్ సౌండ్‌తో రణగోల రణగోల - చిఛీ -చిఛీ - సంగీతం కాదు - అది సంతోషంకాదు - ఇన్నాళ్లకి వానకాలం వచ్చినట్టనుకోగలిగాడు. అన్నపూర్ణ లేచినట్టుంది. తెల్లవారినట్టుంది. కాని వాన తగ్గేట్టులేదు. కాని జడీ జోరూ తగ్గేయి. తాను లేచి చొక్కాతొడుక్కుని తువ్వాలు తలమీద వేసుకొని బాత్‌రూంకు వెళ్లాడు. వెనకవేపు ప్రహరీగోడ మీద కూలి వాలిపోయివుంది బొప్పాయి చెట్టు. పిందెలు గుత్తులు గుత్తులుగా వున్నాయి. పై వరసలో అయిదారు పెద్దకాయలు తయారయ్యాయి. మధ్యకి విరిగి గోడమీదికి ఒరిగిపోయింది. పెరడంతా పాదం మునగా నీరు చేరుకున్నాది. మెడ సాగదీసి తల నిక్కించి బయటికి చూశాడు. దూరంగా పొల్లాల్లోనీరు చేరింది. కోలనీలో రోడ్లమీద నీరు లేదు. తామున్నవీధి తార్రోడ్డు కాలేదు. అవతలి రోడ్డువరకూ పోసి ఆపేశారు. తమయిల్లున్న చుట్టపక్కల రోడ్లన్నీ జారూ బురదానూ దడిపక్కనుంచే మొక్కలన్నీ చూసుకుంటూ నడుచుకుంటూ తడుచుకుంటూ వీధివాకిలి వేపువచ్చాడు. తమ యిల్లుదాటి ముందుకు తిరిగి తార్రోడ్డున్నవేపు మలుపు తిరిగే దగ్గర మదుంవుంది. ఆ మదుం పక్క రాళ్లగుట్టవుంది. ఎవరు పోశారో ఎందుకు పోశారో అక్కడ చాలా పెద్ద పెద్ద రాళ్లున్నాయి. చాన్నాళ్లయి ఆ రాళ్లలాగే వున్నాయి. ఆ రాళ్లగుట్టపక్క పడివుంది - ఎద్దు ! మోర పైకెత్తుకుని వుంది ! ఒక్కసారి గుండెకాయ కడుపులోకి జారినట్టయింది. అరుడులు జాగ్రత్తగా వేస్తూ గబగబా వీధి గేటు తీసుకుని రోడ్డుమీదకి వాచ్చాడు. గబగబా నాలుగడుగులు వేశాడు. కంగారు కంగారుగా పట్టి పట్టి చూశాడు.

ఈ మధ్య నాలుగురోజులాయి కనపడలేదు, తనకీ ఎందుకో గుర్తులేదు. ఏ చీకట్లో ఏపాముకరిచిందో, ఏ జబ్బుచేసిందో, తిండి లేక నీరసంతో బురదలో రాళ్లగుట్ట పక్క జారి పడి బాగా దెబ్బతగిలి మరిక లేవలేకపోయిందో - ఏం జరిగిందో మనకెలా తెలుస్తుంది ? చచ్చి పోయింది ఎద్దు ! బీరపాదు తినేసిన ఎద్దు !

నిలువుగా నీరయిపోయేడు.

ఎద్దు చచ్చిపోతే తనకెందుకు బాధ ? తండ్రా తాతా అన్నదమ్ముడా ఎవరుచచ్చిపోయేరని తనమనసు ఆక్రోశిస్తున్నది ? కళ్లమీదా, నోటిదగ్గిరా ఈగలూ దోమలూ జుంమ్మంటున్నాయి. నిన్నసాయంత్రమో రాత్రో చచ్చిపోవుంటుంది. ఇంకా ఎక్కడైనా జీవుడున్నాడేమో !?

ఏ పత్రిక కనీసం జిల్లా పేజీల్లోనూ ఈ వార్త పడదు.

ఏ రేడియోవాళ్లూ సంతాపసంగీతం మధ్య, బరువైన కంఠం పెట్టి పళ్లుబిగబట్టి ఈ వార్త చదవరు. వాళ్లకంతకంటే పట్టదు. జనం మూగేరు.

కాలం పరుగులు తీస్తుంటే, దానివెనక, కారియరు సైకిలుకు తగిలించుకుని ఆఫీసుకు బయల్దేరాడు. గబగబా సాయంత్రమై పోయింది. గబగబగబా సైకిలు తొక్కుకుంటూ యింటికొచ్చేడు.

పగలంతా ఎర్రని ఎండకాసింది. భూమ్మీద నీరు ఆర్చుకుపోయింది. తమయింటిమలుపు దగ్గర్నించీ వున్న మట్టిరోడ్డు మరీ అంత బురదగా లేదు. దిగేడు సైకిలు. పొట్టబాగా వుబ్బింది. ఎవరీ భారీ కళేబరానికి సంస్కారం చేస్తారు? గొడారి వాళ్లకి కబురుచేస్తే తీసుకుపోతారు. చర్మం వొలిచిఅమ్ముకుంటారు. ఆ చర్మం కాలికింద ఖరీదయిన జోడుగా మారిపోతుంది. కొమ్ముల్తో దువ్వెనలు చేస్తారట. తెల్లగా బూడిదరంగులో వంపులు తిరిగిన దానికొమ్ములు చూశాడు. ఈ కొమ్ములు దువ్వెనకి పనికి రావేమో ! లేక వీటితోనే చాలా అందంగా దువ్వెనలు చేయవచ్చునేమో. ఎద్దు చచ్చినా ఉపయోగపడుతుంది. అమ్ముకున్నవాళ్లకి సొమ్ముసంపాయించి పెడుతుంది. మరి మనిషి ? రేపుతనుచస్తే .....

"బ్రతికి చచ్చియు జనులకెవ్వడు
ప్రీతి గూర్చునొ వాడె ధన్యుడు ...."

చిన్నప్పుడు హైస్కూల్లో చదువుకొన్న వాక్యాలు గుర్తొచ్చాయి గొప్పగా చెప్పేడు మహాకవి.....

-ఇంటికొచ్చాడు. మౌనంగా వున్నాడు. ఒకటి రెండుసార్లు అన్నపూర్ణ, మొగుడివేపు ఎగాదిగి చూసింది. అతగాడెందుకెలా వున్నాడో తెలీదు. ఒకోసారంతే.

భోజనం అయింది. పెండింగ్ వర్క్‌పూర్తిచేద్దామని కొన్ని ఫైళ్లు తెచ్చుకున్నాడు. కొన్నికొన్ని జీవోలు ఎంత బుర్ర లేకుండా తయారుచేస్తారోనని బాధ, అసహ్యం, అసహనం కలుగుతాయి. తప్పదు. ఈ ఉద్యోగం..... ఈ జీవితం..... సంసారం..... ఇవంతే - గాడిద లక్షణంట ఓర్పు ! గాడిదలే కాదు, ఎద్దులేకాదు అన్ని జంతువులూ ఓర్పుగా తలవంచుకునే వుంటాయి. మానవుల ఏలుబడిలోకి వచ్చాక తప్పదు.

ఫైళ్లు విప్పుకొని కొంత పనిచేద్దామని కూర్చున్నాడు. కన్ను నిలవటంలేదు. అక్షరాలు పోలిక తెలియడంలేదు. మెదడు ఆలోచించడం లేదు. ఊపిరి పీలుస్తూనే వున్నాడు. గుండె కొట్టుకుంటూనే వున్నాది. కేవలం ఈ చర్యలే జీవనమా ? ఊపిరీ, గుండె ఆగిపోతే చచ్చిపోతారు. ఎద్దుక ఊపిరీ, గుండె ఎప్పుడో ఆగిపోయాయనమాట -

నిద్రొస్తుంది ? నిద్ర కారనుకుంటాను. తనలో తనే తల పంకించుకుంటూ కళ్లజోడు తీసేశాడు. ఫైళ్లు కట్టేశాడు. కుర్చీలోంచి లేచి దీపం తీసేసి వెళ్లిమంచం మీద వాలాడు. నోరు పగిలిపోయేలా పెద్ద ఆవలింతతీశాడు. చిటికెలు వేశాడు. చేతికి దోమలు తగిలాయి గట్టిగా కళ్లుమూసుకున్నాడు నారాయణ.

తుళ్లిపడి మెలుకువొచ్చింది. ఎద్దురంకెవేసినట్టయింది. చి ఛీ - తనకి బుద్ధిలేదు. పిచ్చిగాని పట్టిందా . ఏమిటీ దిక్కుమాలిన ఆలోచన్లు ? దిక్కుమాలిన ఎద్దు, దిక్కుమాలిన బతుకు -

తనకెందుకిలా మెలుకువొచ్చిందో నారాయణకి ఎంతాలోచించినా బోధపడిందికాదు. లేచి పెరట్లోకి వెళ్లాడు. తమ ఇంటిపక్కనున్న వీధి దీపం మిరుమిట్లుగొలుపుతూ వెలుగుతున్నాది. మరి ముందుగాని, ఆవెనకగాని దీపాలు వెలగడం లేదు. ఆ తొలి వరస ఇళ్ళదగ్గిర, తార్రోడ్డువేపు మళ్లీ వెలుగుతున్నాయి. కనుచూపు పారినంతవరకూ మాత్రం చీకటే -

చాలాసేపు నిద్రపట్టలేదు. పెద్దవాడి చదువుమాటకేంగాని - పెద్దపిల్లకి పెళ్లయిపోతే బాగుణ్ణు వాడినింక పై చదువులకి పంపడం అనవసరం. చదివిన కాడికి చాలు. ఏదో ఒక ఉద్యోగం చూసుకోమనాలి. పెళ్లి ళ్లు కావాలంటే వాళ్ల వొంటి మీద చిన్న పిసరయినా బంగారం కావాలి. ఈ యింటి చుట్టూ కాంపౌండు వాలు కట్టాలి. వెనకపక్క తప్ప మిగత మూడు పక్కలా కంచేవుంది. డాబా మీద చక్కగా విశాలంగా ఒకగది కట్టుకోవాలి. చాలు చాలు - ఇక్కడికిది చాలు, తను మరిసాగలేడు..

అన్నపూర్ణ వొత్తిగిల్లి పడుకుంది.

నారాయణకి నిద్ర పట్టలేదు. ఇటు దొర్లాడు. అటూ దొర్లాడు. మళ్లీ ఇటుదొర్లి ముడిచిపెట్టుకుని రెండు మోకాళ్లలో చేతులు బిగించుకుని పడుకున్నాడు. దోమలు రొద చేస్తూ రక్తం పీలుస్తూనేవున్నాయి. కళ్లు చిట్లించాడు. వెలుతురు చూడలేకుండా వున్నాడు. కళ్లకి చెయ్యడ్డం పెట్టుకున్నాడు. గోడ గడియారం టైము పావుతక్కువ ఎనిమిదయ్యిందని చెప్తున్నాది. వెలుతురు కాదిది. ఎర్రని ఎండే. లేచాడు.

"రాత్రి సరిగ్గా నిద్ర పట్టినట్టు లేదు కదూ. అందుకే లేపలేదు" అన్నది అన్నపూర్ణ తల ఎత్తకుండా పనులు చేసుకుంటూ. పెద్దకూతురు గదులన్నీ తుడుస్తున్నాది.

పెరటివేపు వెళ్లిచూశాడు. ఎద్దు లేచి నడిచి వెళిపోయిందా ?

ట్రియ్యి ట్రియ్యిమని చెవుల్లో హోరు. అన్నపూర్ణ గ్రైండర్ ఆన్‌చేసి కొబ్బరి పచ్చడి తయారు చేస్తున్నది. స్నానం - టిఫిను - సైకిలుకి ముందుకి భోజనం కేరియరు - సైకిలు వెనక ఫైల్లు ! ఒంటెద్దు బండి ప్రయాణానికి సిద్ధం !

"మూడవనంబరు ప్లాటుఫారము మీద నుండి కొద్దిక్షణములలో విశాఖపట్నం నుండి రాజమండ్రి పోవు పాసింజరు రైలు బయలుదేరుటకు సిద్ధముగా నున్నది."

వెధవగ్రాంధిక భాషను గవర్నమెంటు వదల్డం లేదు. గండకత్తెరలా పట్టుకుని వుంది. తను ఈ రోజు చాకిరీకి బయల్దేరడానికి సిద్ధంగా ఉన్నాడు. నవ్వుకుంటూ తనలో తనే తలవూపుకుంటూ బట్టలు వేసుకున్నాడు. అద్దం ముందుకొచ్చాడు. ప్లాస్టిక్ దువ్వెన విరిగిపోయింది. పక్కనున్న కొమ్ము దువ్వెన ఎందుకో అందంగా కూడా కనిపించింది.

"ఈ దువ్వెనెక్కడిదీ - ?" అనడిగాడు అన్నపూర్ణనుద్దేశించి. అన్నరపూర్ణ పక్కగదిలో వుంది.

"బాగానే వుంది. మీకెన్నిసార్లు చెప్పినా గుర్తుండదు. దువ్వెన మనదే "

"మనదా ? ఎప్పుడుకొన్నారూ ?

"చాన్నాళ్లయింది. పెద్దప్లాస్టిక్ దువ్వెన విరిగిపోతేనూ - తీశాను -"

"కొమ్ముదువ్వెన కదూ - ఎద్దు కొమ్మేనా ?"

"కాదు - గేదె కొమ్ము " ఈ ఆడవాళ్లకి ఇంతలోక జ్ఞానం ఎక్కంచి వస్తుందో -

మెల్లిగా గుమ్మందిగి రోడ్డుమీదికి వచ్చి సైకిలెక్కాడు. సమయం తొమ్మిదీ నలభయి ఎండకి వీపు చుర్రుమంటుంది - "బ్రతికి చచ్చియు ప్రజలకెవ్వడు మేలు చేయునో " తను ఎవ్వడికీ మేలు చేయలేదు.

సరిగ్గా అక్కడికి వెళ్లే సరికి స్లోగా నడుస్తోంది సైకిలు. మట్టిలో ఎద్దును ఈడ్చిన జాడలు. ఎవరు ఈడ్చుకు పోయేరో - దాని చర్మం జోళ్లు, దాని కొమ్ములు దువ్వెనలు - చచ్చినా ఉపయోగపడటం మనిషికి సాధ్యమా ? - రివ్వున ఒక్కగాలి తెర లేచింది. ఎదురుగాలికి సైకిలు నిలబడిపోయింది. పిక్కబలం చూపించి పెడలు ఒక్కతొక్కేడు. తన గానుగెద్దు జీవితం మీద చెప్పరాని విసుపుకలిగింది.

అమ్మకి అమ్మమ్మ - రాజమ్మ, అందరూ "రాజమ్మామ్మా" అనీవారు. చాలా ముసిద్ది. ఎనభయిపైమాటే. నడుం వంచుకొని నడిచేది. గొడవలొచ్చి దెబ్బలాడుకొన్నప్పుడు "ముసీలి వరడ" అనీవారు. ఆవిడ చెప్పేది.... తనకప్పుడు నిండా పదేళ్లు లేవు. మనిషి వయసు వందేళ్లు కాదట. నేను తొందరగా చచ్చిపోతున్నాని, ఆయుష్షు పెంచమనీ వెళ్లి దేవుడికి మొరపెట్టుకున్నాడట. కోతి ఏళ్లు కొన్నీ, ఎద్దు ఏళ్లు కొన్నీ కలిపి - ఇకవెళ్లునీకు వందేళ్ళు ఆయుష్షు అన్నాడట, దేవుడు. అయితే నువ్విప్పుడూ కోతివా, ఎద్దువా హేహే ముసలికోతి – పండుకోతి - ముసలి ఎద్దు అని గుంటలందరూ చప్పట్లు కొట్టి గొడవచేసి హాస్యం చేసేవారు. "ఎందుకురా అలా రాలిపోతారు. గుంటపాపల్లారా -" అని తిట్టేది. నవ్వేది. మళ్లీ ప్రేమగా దగ్గరికి తీసుకుని ఎంతో ఆపేక్ష చూపిస్తూ - " పెద్దవాళ్లయితే మీదీ ఎద్దుబతుకే మీనాన్నని చూడు. మీ నాన్నకిప్పుడు ఎద్దు ఏళ్లే "- అనేది. ఆ ముసిల్దాని మాటలు బోధపడేవికావు. తండ్రికప్పుడు కొంచెం అటే యిటూగా తన వయసే.

కాలనీ దాటి రోడ్డుమీదికొచ్చింది సైకిలు, రిక్షాలు, సిటీబస్సులు, ఆటోలు, స్కూటర్లు, - సందడే సందడి. జనమే జనం - ఎంత పనికి మాలిన ఉద్యోగం అయనా ప్రతివాడికీ స్కూటరు. పాలుపోసేవా స్కూటరు. తాపీమేస్త్రికి స్కూటరు, కలక్టరాఫీసు బంట్రోతుకీ స్కూటరే. గబగబా సైకిలు తొక్కుతున్నాడు. ఇవ్వాళ బోల్డు పనుంది. సెక్షను సూపర్నెంటుగారు తననికొంచెం తొందరగా రమ్మనిచెప్పారు. బెల్లు గణగణలాగించాడు. సైకిలు తొక్కేవాడూ మనిషేనా అన్నట్టు చూశాడు. వెనక్కి తిరిగి తనకు అడ్డంగా వెళ్తున్న హోండాబండివాడు. సైకిలూ ఎద్దులబండీ ఒకటేననమాట ! ఎంత చులకనగా చూశాడు !

ఆఫీసు పని - ఒకటే పని - పన్నెండున్నరకు కరెంటు పోయింది. ఆగస్టునెల చివరవారంలో కూడా ఉక్క చెమట. నాలికతో పెదవులు తడుపుకుంటే ఉప్పగా తగిలింది నోటికి. తనబోటివాళ్ల బతుకు ఉప్పగానే వుంటుంది మరి. భోజనం చేస్తుంటే చారుకప్పులో ఉప్పులేదు. లేచి వెళ్లి - సొరుగు లోవుంచుకున్న చిన్నఉప్పు పొట్లం తీసుకుని వేసుకుని వేలితో కలుపుకుని అన్నం పూర్తిచేశాడు.

నాలుగయింది. అయిదయింది. ఆరయింది. ఆరున్నరయింది. లాభంలేదు. కొరడాతో కొట్టినా ఎద్దు బండి లాగలేక పోతోంది. లేచాడు. నైటువాచ్చరు జీడదమ్ముకొడుతూ మెల్లుమీదకూచున్నాడు. అతను పడుచువాడే. తండ్రి సర్వీసులో వుండగానే మరణించాడు గనుక, కుర్రవాడికి ఉద్యోగం ఇచ్చారు. వయసు మఫ్ఫయిరెండో, ముప్పయి మూడో వుంటాయి. గుమాస్తా కొడుకు గుమాస్తా, టీచర్‌కొడుకు టీచర్, కలక్టరు కొడుకు కలక్టర్ లేక మరో పెద్ద ఉద్యోగి, సినీనటుడి కొడుకు సినీనడుడు, ప్రధాని కొడుకు ప్రధాని. నీరు పల్లానికే, డబ్బు డబ్బు గలవాడికే, ఇదే లోకం తీరు.....

నారాయణ యాంత్రికంగా సైకిలు తొక్కుతున్నాడు. హైస్కూల్లో చేరిన కొత్తలో ప్రారంభించాడు సైకిలు తొక్కడం. అంటే సుమారు నలభయి ఏళ్లనుంచీ ఇలా సైకిలు తొక్కుతూనే బతికేస్తున్నాడు. ఉద్యోగం జీవితం, ప్రమోషన్, పిల్లలు ఎదగడం, జీతాలు పెరగడం, ధరలు పెరగడం, ఉరుకులు పరుగుల జీవితం - ఏమార్పు లేదు - ఏ అభివృద్ధీ లేదు - గానుగెద్దు జీవితం - మెయిన్ రోడ్ నుంచి మళ్లి కోలనీ రోడ్డుకి మళ్లాడు. దీపాలచుట్టూ దోమలు ఆరాటంగా గింగుర్లు కొడుతున్నాయి. తమరోడ్డు మలుపు, చిన్నమదుం - అక్కడ స్తంభం వుంది గాని లైటు వెలగడంలేదు. ఎద్దు చచ్చిపోయినట్టు లేదు. నెమరువేసుకుంటూ నింపాదిగా పడుకుని పడుకుని నిమ్మకంగా లేచి వెళిపోయి వుంటుంది. సైకిలు ముందు చక్రం గజగజ లాడింది, ఆగిపోయింది. ఇసక మేటులో ముందుచక్రం కూరుకుపోయింది.

కామరాజుగారి ఇంటి కట్టుబడి ఇంకా పూర్తికాలేదు గావును. దిగి సైకిల్ని వెనక్కి లాగి, చక్రం తిప్పి, మళ్లీముందుకు తోశాడు. ఇంత బరువుగా వుందేమిటీ సైకిలు ? నారాయణ అలసటగా విసుపుగా సైకిలు తోసుకుంటూ ఇంటి గుమ్మం వరకూ వచ్చిచెల్లుకొట్టాడు.

రచన : 7- 9 - 1997

thoroughly revised draft : 4-5-1998